విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమ గోదావరి

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: మహిళా మల్లయోధులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కన్వీనర్ కొండేటి బేబీ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో గురువారం మహిళా రెజ్లర్లకు మద్దతుగా రెండోరోజు సంతకాల సేకరణ నిర్వహించారు. కొండేటి బేబీ మాట్లాడుతూ మహిళా రెజ్లర్ల పోరాటానికి కేంద్రం స్పందించడం లేదని విమర్శించారు. దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులకు, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే బీజేపీ ప్రభుత్వానికి మహిళల పట్ల గౌరవం లేదని, వారి సమస్యకు పరిష్కారం చూపించే అవకాశం లేదని మరోసారి మన దేశ రెజ్లర్ల లైంగిక వేధింపుల నేపథ్యంలో రుజువైందని ఎద్దేవా చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఏలూరు నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర మాట్లాడుతూ కమిటీ రిపోర్టును కేంద్రం ఎందుకు బయట పెట్టలేదని ప్రశ్నించారు. దీన్ని దాచి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను కాపాడుతోందని విమర్శించారు. ఏలూరు నగర సమితి సభ్యులు కొల్లారి సుధారాణి, ఉప్పులూరి లక్ష్మి, భవాని,జోజి మేరీ, నిస్సి,హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ కవితలకు విశేష ప్రశంసలు

విశాలాంధ్ర-తణుకు: ఇటీవల తెనాలిలో జరిగిన పద్మభూషణ్ గుర్రం జాషువా కళాపరిషత్ 35వ వార్షికోత్సవ మహా సభలలో తణుకు పట్టణ కవి వీఎస్‌వీ ప్రసాద్ రచించిన కవితలకు విశేషప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో దిగిరావా జాషువా అనే కవితకు విశేష స్పందన వచ్చింది. అనంతరం సంస్థ అధ్యక్షులు డా॥హేద్దేటి యోహాన్ కవి ప్రసాద్‌కు జ్ఞాపిక యోగ్యతాపత్రం శాలువాతో ఘనంగా సన్మానించారు. విషయం తెలుసుకున్న మంత్రి డా॥ కారుమూరి ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

జాతరలు ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ దేవతల జాతరలు ఘనంగా నిర్వహించాలని దీనికి దాతలు సహకారం అందించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. గురువారం గణపవరం మండలం వల్లూరు గ్రామ దేవత కోట్లమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవ సందర్భంగా అమ్మవారిని స్థానిక నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముచ్చర్ల వేణుగోపాల మురళీకృష్ణ, ఎంపీపీ దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము), వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని డీఎల్‌డీఓఎం రాజు తెలిపారు. మండలంలోని టి నరసాపురం, ఏపీగుంట, తిరుమల దేవిపేట సచివాలయాలను గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారుల కు అందేటట్లు చర్యలు చేపట్టాలని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ పి శేఖర్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు వడదెబ్బపై అవగాహన

విశాలాంధ్ర-భీమవరంటౌన్: వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసు కుంటూ, ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని వైద్య సిబ్బంది సూచించారు. గురువారం గొరగనముడి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఎన్ఆర్ ఈజీఎస్ కూలీలవద్దకు వెళ్లి వడదెబ్బ వల్ల కలుగు ఇబ్బందులపై, అవగాహన కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్ల ప్రాముఖ్యతపై, ఆరోగ్య భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది ఎం ఎల్ హెచ్ పి రమేల,ఆరోగ్య సహాయకుడు ఎం విజయ ప్రసాద్, ఏఎన్ఎం వేదకుమారి, ఆశా వర్కర్లు శాంతి, కుమారీలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత తదితరులు ఉన్నారు.

శాఖ గ్రంథాలయంలో యోగ తరగతులు

విశాలాంధ్ర-భీమవరం: శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం యోగ, ప్రాణాయామం, ఆసనాలు తదితరాంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా యోగా గురువు కలిగొట్ల గోపాల శర్మ మాట్లాడుతూ ప్రాణయమం చేయడం వల్ల శ్వాస నియంత్రణలో ఉంటుందని, ఏకాగ్రత పెరుగుతుందని, మెడిటేషన్ చేయడం వల్ల ఉత్సాహంగా ఉంటారని సోదాహరణంగా వివరించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, చదువరుల సంఘం అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, సంఘసేవకులు చెరుకువాడ రంగసాయి, డి.రామనాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మణిపూర్ దమనకాండను నిరసిస్తూ ధర్నా

విశాలాంధ్ర-భీమవరం: మణిపూర్ లో క్రైస్తవులపై జరిగిన దమనకాండకు కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దళిత ఐక్య వేదిక గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ మాట్లాడుతూ మణిపూర్ దమనకాండలో నలభై మందికి క్రైస్తవులను ఊచకోత కోయడమే గాకుండా క్రైస్తవ సంస్థలను, చర్చిలు ధ్వంసం చేయడం లౌకిక వ్యవస్థకే మాయని మచ్చని దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ గ్రంధి పవన్ కు అందచేశారు. పాలపర్తి జోనా, గొల్ల రాజకుమార్, బలే ఏసు బాబు, ఆలమూరి బాబ్జీ, గెడ్డం జార్జ్, మరపట్ల మునియ్య, పట్టెం శుభాకర్, ఉండ్రు విల్సన్, పాము నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు సమాచారంతో సూపర్నెంట్ అరుణ కుమారి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం నీలాద్రిపురం గ్రామంలో గురువారం తనిఖీ చేస్తూ ఉండగా అమ్మడానికి సిద్ధంగా ఉన్న రెండు లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చేటేకిబత్తుల నాగవెంకట కొండలరావును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు, సీతారాం, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ మూర్తి, నీలాద్రిపురం జి ఎం ఎస్ కె సునీతరాణి, పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ

విశాలాంధ్ర-గణపవరం: గణపవరం మండలం కాశిపాడులో బైరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం గ్రామీణ విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత మూడురోజుల పాటు వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రాం కోఆర్డినేటర్ బీ దుర్గాప్రసాద్ తెలిపారు. నెంబర్1, 2 పాఠశాలలో చదువుతున్న సుమారు 60 మంది విద్యార్థులకు కంప్యూటర్ పై అవగాహన, గణితంలో సమస్యలను సులభంగా ఏ విధంగా బోధించడం అనే అంశంపై శిక్షణ కార్యక్రమాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల హెచ్ఎంలు కె మంజుల,టి ఎస్ వి రంగ నాయకులు, ఉపాధ్యాయులు చల్లా కృష్ణ, డి వెంకట్ లక్ష్మి పార్వతి, జి దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ మానవత్వం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: ఆ వృద్ధుడు ఎవరో తెలియదు. ఏ జిల్లా వాడో కూడా తెలియదు. అయినా మా జిల్లా వాడు కాదేమోనని సందేహించలేదు. తానూ మనిషే కదా అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వి.వెంకటేష్ మానవత్వం ప్రదర్శించన తీరు మండలంలో సర్వత్రా చర్చనీయంశామైంది. ఈ సంఘటన ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలంలో జరిగింది. మండలంలోని కనకాద్రిపురంలో కోళ్లఫారం సమీపంలోని కొద్దిరోజులుగా గుర్తుతెలియని వృద్ధుడు రోడ్డు పక్కన పడి ఉండటం అందరూ చూస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఆకలితో అలమటిస్తున్న ఆ వృద్ధుడి పరిస్థితిని ముంజకాయల వ్యాపారి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఆ వృద్ధిడికి పునరావాసం కల్పించాలని అధికారులను ఆదేశించారు. దీంతో సిబ్బంది వృద్ధుడు ఉన్న ప్రాంతానికి హుటాహుటిన వెళ్లి, అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కొత్త దుస్తులు తొడిగించి చికిత్సలు చేయించారు. ఆ వృద్ధుడి వివరాలు తెలియకపోవటంతో స్థానికంగా ఉన్న రోటరీ క్లబ్ వృద్ధాశ్రమంలో చేర్పించాలని ప్రయత్నించారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-మండవల్లి: ప్రభుత్వ బీమా పథకాల్లో చేరి విపత్తు సమయంలో పరిహారం పొందవచ్చని మండవల్లి ఇండియన్ బ్యాంకు మేనేజర్ బి.దుర్గారావు అన్నారు. తక్కెళ్లపాడులో బ్యాంకు ద్వారా అందిస్తున్న పథకాలపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్ పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజనలో చేరి సహజమరణం చెందటంతో క్లయిం పరిహారం 2 లక్షల రూపాయల చెక్కును నామినికి అందించారు. సర్పంచ్ సిహెచ్ సుధారాణి.ఐక్యవేదిక నాయకులు భాస్కరరావు ,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల క్షేమం కోసమే ఆర్బీకేలు

విశాలాంధ్ర-భీమవరం టౌన్: రైతు ప్రయోజనం కోసమే సీఎం జగన్ ప్రత్యేకంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రూ.60 లక్షల నిధులతో తాడేరు, బేతపూడి గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం రైతు భరోసా కేంద్రానికి స్థలం దానం ఇచ్చిన దాతలు బండి వీర వెంకట నాగ సత్యప్రసాద్, పెను కుదురు సీతయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటరత్నం, సూర్యనారాయణలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జిల్లా ఎంపీపీల ఛాంబర్ అధ్యక్షులు పేరిచర్ల విజయ నరసింహారాజు, జడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, తాసిల్దార్ వై రవికుమార్, ఇంచార్జ్ ఎంపీడీవో రామచంద్ర ప్రభు, పంచాయతీరాజ్ డిఇ స్వామి నాయుడు, జె ఇలు శ్రీనివాస్, కనకారావు, ఏవో శ్రీనివాస్, ఆర్ బి కె చైర్మన్ కురెళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజా సమస్యలు మరచి తుగ్లక్ పాలన సాగిస్తున్న జగన్ కు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు పవర్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలను ఆయన ప్రస్తావించారు. టీడీపీ హయంలో 80 శాతం పూర్తయిన ఇళ్లను కూడా పేదలకు ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో వైసీపీ ప్రజాప్రతినిధులు ఉండటం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్ చేతకానితనం వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అధోగతి పాలైందని, పేదల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని బడేటి చంటి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా చైతన్యం ద్వారానే జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పాలన్న నిర్ణయంతో తాము నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి పూర్తి స్థాయిలో విజయవంతమైందని బడేటి చంటి పేర్కొన్నారు. పాలి ప్రసాద్, చోడే వెంకటరత్నం, పెద్దిబోయిన శివప్రసాద్, రెడ్డి నాగరాజు, టిడిపి ఎస్ సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ, నేరుసు గంగరాజు, లంకలపల్లి మాణిక్యాలరావు, మారం హనుమంతరావు, జంప సూర్యనారాయణ, పిల్లారిశెట్టి సంధ్య సురేష్, అర్నేపల్లి తిరుపతి తదితర నాయకులు పాల్గొన్నారు.

జనంలోకి జనసేన

విశాలాంధ్ర- తణుకు: పట్టణం లోని 24వ వార్డు నుంచి తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ విడివాడ రామచంద్ర రావు నాయకత్వంలో జనంలోకి జనసేన జనం కోసం జనసేన అనే కార్యక్రమం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను ఆశయాలను ప్రజలకు ఆయన చేసిన సేవలను తెలియజేశారు. తణుకు పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు కొమిరెడ్డి శ్రీనివాస్,తణుకు పట్టణ యూత్ అధ్యక్షులు గర్రె తులసీరామ్, 24వ వార్డు జనసేన పార్టీ నాయకుడు ఆకుల సతీష్, బెజవాడ సత్యనారాయణ, రాజనేని అరుణ్, గుమ్మల ప్రతాప్, పిల్ల జగన్, కారుమూరి మారుతి, రిల్లు తేజ, ఎల్ నారాయణ, టౌన్ ప్రధాన కార్యదర్శి పంతం నానాజీ, జనసేన పార్టీ జిల్లా సెక్రెటరీ తామరపు నరసింహారావు తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ లీగల్ సెల్ సెక్రెటరీ కొయ్యల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మహిళా మార్టులు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్: పట్టణ, అర్బన్, కార్పొరేషన్ ప్రాంతాల్లోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా మార్టులు ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మెప్మా మిషన్ డైరెక్టర్ వి. విజయలక్ష్మీ అన్నారు. గురువారం స్థానిక మూన్ లైట్ ఫంక్షన్ హాల్లో వైఎస్ఆసరా, సున్నావడ్డీ, మహిళా మార్ట్, డీమార్ట్, పట్టణ పేదరిక నిర్మూలన, టిడ్కో ఇళ్ళ పంపిణీ, డ్వాక్రా రుణాల మంజూరు తదితర అంశాలపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లోని మహిళలను అన్ని రంగాల్లో ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా మెప్మా పిడి ఇమ్మానుయేలు, డిసి జగదీష్, తాడేపల్లిగూడెం మెప్మా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, పట్టణ మహిళా సంఘాల సమాఖ్య అధ్యక్షురాలు బోళెం రామలక్ష్మీ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

విశాలాంధ్ర-కలిదిండి: వివాహేతర సంబంధం కారణంగా యువకుడు దారుణ హత్యకు గురైనట్లు ఎస్సై మణికుమార్ తెలిపారు. మండలంలోని కోరుకొల్లు గ్రామానికి చెందిన బిరుదు గడ్డ శేఖర్ (24) ప్రభుత్వ మద్యం దుకాణంలో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో తాడినాడలోని మద్యం దుకాణంలో కలెక్షన్ చేస్తుండగా కలిదిండి మండలం పోతుమర్రు పంచాయతీ శివారు గొల్లగూడెం గ్రామానికి చెందిన కట్ట రామ్మోహన్ (రాము) రంపపు బ్లేడ్‌తో కంఠం వద్ద కోయడంతో శేఖర్ మృతి చెందాడు. తండ్రి బిరుదుగడ్డ ఏలియా ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శేఖర్ మృతితో మండలంలోని కోరుకొల్లు, బరింకలగరువు దళిత వర్గాలు కలిదిండి సెంటర్లో గురువారం రాస్తారోకో చేసి ధర్నా నిర్వహించారు. దీంతో భీమవరం-విజయవాడ రోడ్‌లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దళిత నాయకులతో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీఎల్ నాయుడు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడి ఆర్థికా సాయం అందజేస్తామని, నిందితుడిపై చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులుగా బాలకృష్ణ, వసంతరావు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ఏఐటీయూసీ మండల నూతన అధ్యక్షునిగా పెడశనగంటి బాలకృష్ణ, కార్యదర్శిగా కుంచే వసంతరావు, ఉపాధ్యక్షుడిగా డిఎన్ రామ కృష్ణంరాజు, సహాయ కార్యదర్శిగా కూనపాముల విగ్నేష్, కోశాధికారిగా ఎస్‌కె సలీం, కమిటీ సభ్యులుగా మరో ఆరుగురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐటీయూసీ మండల మహాసభ బుధవారం జరిగిన అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏరియా ఆసుపత్రి కార్మికుల యూనియన్, ఆర్టీసీ హమాలీ యూనియన్‌లు, సీపీఐ నుంచి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు రమణ రాజు తెలిపారు. ఏఐటీయూసీ మండల కార్యవర్గ సభ్యులుగా ముప్పిడి సురేష్, కొత్తూరి శ్రీను, యడ్లపల్లి ప్రసాద్, కోట దయామణి, గంజి కృష్ణ వేణి, పసుపర్తి శ్రీనివాస రాజు ఎంపికయ్యారని తెలిపారు. నూతన కమిటీని మన్నవ కృష్ణ చైతన్య, బండి వెంకటేశ్వరరావు అభినందించారు. సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు అయితా సురేష్,మండల కమిటీ సభ్యుడు చిట్టూరి వెంకటేశ్వర రావు, ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎం.పాండు రంగారావు,జిల్లా యూనియన్ నాయకులు రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు అనుసరించాలి

విశాలాంధ్ర- ఏలూరు: భారత ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు జారీ చేసే మార్గ దర్శకాలను అను సరిస్తూ ఈఆర్ఓ నెట్ 2.0 పై అవ గాహన కలిగియుండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. గురువారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2023 జనవరి 6వ తేదీ ఓటర్ల తుది జాబితా ప్రచురణ అనంతరం కొత్తగా చేర్పులు, మార్పులు, ఇఆర్ఓ నెట్ 2.0 అంశాలు, ఫొటో ఓటర్ల గుర్తింపు కార్డుల పంపిణీ, ఈవిఎం గోదాములు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఈవిఎంల గోదాములు పూర్తి భద్రతతో ఉండాలని, బెల్ కంపెనీ కొత్త ఈవిఎంలు జూన్ నుంచి జిల్లాలకు రానున్నాయని తెలిపారు. ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, డిఆర్ఓ ఎవిఎస్ఎస్ మూర్తి, జెడ్పి సిఇఓ రవికుమార్ పాల్గొన్నారు.

118మందికి ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ....

విశాలాంధ్ర-ఆచంట: మండలం ఆచంట పోరా గ్రామంలో జగనన్న కాలనీలో కోర్టు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల పట్టాలను కోర్టు కేసు పరిష్కారం కావటంతో 118 మంది లబ్ధిదారులకు ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు గురువారం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో అందచేశారు. ఆచంట గ్రామ సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావ, ఉప సర్పంచ్ అద్దాల పెద్దిరాజు,గ్రామ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్లు,అధికారులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్స్ తనిఖీ

విశాలాంధ్ర-ఉండి: ఈవిఎం మిషన్లు, వీవీ పాట్స్ తదితర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచేందుకు ఉండి అగ్రికల్చర్ మార్కెటు గోదాములను జిల్లా జాయింటు కలెక్టరు రామ్ సుందర్ రెడ్డి పరిశీలించారు. విద్యుత్, రహదారి, షటర్ల పటిష్టత తదితర సౌకర్యాలు పరిశీలించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అలాగే అనువైన భద్రతా గదులు అన్నిటిని నిశితంగా పరిశీలించారు. ఆర్డీఓ దాసి రాజు, తహశీల్దారు వై. రవికుమార్, వేర్‌హౌసింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారులో మంటలు... త్రుటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలోని అజంతా బార్ సమీపంలో గురువారం, ప్రధాన రహదారిపై వేగంగా ప్రయాణిస్తున్న ఒక కారులో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. దట్టంగా పొగలు వ్యాపించాయి. విషయం ముందుగా గమనించిన స్థానికులు కేకలు వేయడంతో కారు నడుపుతున్న వ్యక్తి అప్రమత్తమై చాకచక్యంగా కారు డోర్‌ని తెరిచాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారందరూ ప్రాణాలతో బయటపడగలిగారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణానష్టం సంభవించలేదు.

ఘనంగా గంగారాజు వర్ధంతి

విశాలాంధ్ర-కైకలూరు: కొల్లేరు ముద్దుబిడ్డ స్వర్గీయ సైదు గంగరాజు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వడ్డీల సాధికారిక కన్వీనర్ బలే ఏసురాజు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. జనసేన పార్టీ దెందులూరు ఇన్‌చార్జి గంటసాల వెంకటలక్ష్మి, ఏలూరు జడ్పిటిసి మండల కొండలరావు, కలుకూరు సర్పంచ్ బలే నాగ ప్రసాద్,సాహితీవేత్త కొల్లేరు ముద్దుబిడ్డ చింతపల్లి వెంకట నారాయణ,కొల్లేరు సీనియర్ నాయకులు కొవ్వాడలంక గంటసాల వెంకటేశ్వరరావు , పెంచికలమర్రు మాజీ సర్పంచ్ సుబ్బరాజు, సైదు గంగరాజు కుమారులు వారి కుటుంబ సభ్యులు కొల్లేరు ప్రాంత నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర: లింగపాలెం: ఆశన్నగూడెంలో రహదారుల మార్జిన్ లో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించే పనులను గురువారం మొదలు పెట్టారు. ఆక్రమణల వలన సొంత ఇళ్లకు వెళ్లే దారి లేకుండా ఉందని స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది వీటిని తొలగించే పనిలో పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగిస్తామని మండలస్థాయి అధికారులు తెలిపారు.

జనసేన ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా

విశాలాంధ్ర-నిడమర్రు: నిడమర్రు మండలం పెద నిండ్రకొలను గ్రామ ప్రజలు తాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని గురువారం జనసేన నాయ కులు తెలియచేయగా వెంటనే స్పందించి శ్రీ లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీరును సరఫరా చేసిన ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు, జనసైనికులు సరిపిల్లె లక్ష్మణ్, నేలపాటి ప్రవీణ్ తరులు పాల్గొన్నారు.

మైసూరు సెమినార్‌కు రంగరాజు మాస్టారు

విశాలాంధ్ర-ఉండి: కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వ విద్యాలయం మైసూరులో జరిగే జాతీయ సెమినార్‌కు పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండలం, చెరుకు వాడకు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు, కవి, రచ యిత గాదిరాజు రంగరాజు ఎంపికయ్యారు. శుక్ర, శనివారం నిర్వహించే సెమినార్ లో తొలి సదస్సుకు నిర్వహణ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు, యూనివర్సిటీ డీన్ ఆచార్య మొగరాల రామనాథం నాయుడు అధ్యక్షత వహిస్తారు. నాలుగో విభాగంలో తాను పత్ర సమర్పణ కూడా చేస్తున్నట్టు రంగరాజు తెలిపారు. తనకు అవకాశం కలిపించిన తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య ఎం. రామనాథం నాయుడుకు రంగరాజు ధన్యవాదములు తెలిపారు.

పాలనలో వైసీపీ ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-భీమడోలు: పాలనలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టీడీపీ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు విమర్శించారు. గురువారం స్థానిక ఆయన క్యాంపు కార్యాలయంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి ముగింపు సందర్భంగా పాత్రి కేయులతో మాట్లాడారు. నియోజ కవర్గంలో నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా అనేక సమస్యలు వెల్లువెత్తాయ న్నారు. రహదారులు, నిరుద్యోగం, కుంటుబడిన అభివృద్ధి, అవినీతి సమస్యలు ప్రధానంగా ఉన్నాయని తెలిపారు. మద్యం, ఇళ్ళస్థలాలు, విద్యుత్ సమస్య లపై అనేక ఫిర్యాదులు అందాయని వివరించారు. శిరిబత్తిన వీరవెంకట సత్యన్నారాయణ, కరణం పెద్దిరాజు, దూసనపూడి పుల్లయ్యనాయుడు, షేక్ మీరా, యడ్లపల్లి శ్రీరామకృష్ణ, శేషాపు శేషగిరి, పైడిమాల యుగంధర్, యడ్ల రమేష్, కుక్కల ప్రసాద్, పేద్ద సత్యన్నారయణ, కాబోతుల సోమేశ్వరరావు, గేదెల రామారావు, పోనేటి లక్ష్మణ్, దుంగా రమణ, దూబా రమణ, పెద్దిరెడ్డి సురేష్, తలగళ్ళ వెంకటేశ్వరావు, పడాలనాగరాజు, గురజాలశ్రీను, వివిధ హెూదాలు గల టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.